క్లుప్తంగా

జగనన్న లేఅవుట్ పరిశీలన



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని జగనన్న లేఅవుట్‌ను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి పరిశీలించారు. యూకలిప్టస్ చెట్ల దగ్గర 250 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు భూమి కొనుగోలు చేశామని తెలిపారు. అయితే కొందరు భూమి తమకే ఉందని కోర్టును ఆశ్రయించడంతో రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి, భూమి ఇచ్చిన వారికి బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేశామని తెలిపారు. కోర్టు కారణంగా కొంత ఆలస్యం అయిందన్నారు. వారంలో 250 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామని తెలిపారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, హౌసింగ్ ఏఈ యోగానంద్, వైఎస్సార్ సీపీ నాయకులు కరీముల్లా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పరీక్ష బుక్‌లెట్ ఆవిష్కరణ



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

బైరెడ్డిపల్లె: యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన 10వ తరగతి మోడల్ పరీక్ష బుక్‌లెట్‌ను బుధవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయం వద్ద ఎంఈఓలు సాయిలీల, సుబ్రమణ్యం ఆవిష్కరించారు. కేజీబీవీ, ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి బుధవారం అవగాహన కల్పించారు. రాబోవు ఎన్నికల నేపథ్యంలో వాటిని వినియోగించే విధానంపై గ్రామస్తులకు, రాజకీయ పార్టీ నేతలకు వివరించారు. మాక్ పోలింగ్ నిర్వహించారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గణపతి, మాజీ ఎంపీటీసీ జిలానీ, డీటీ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై..



కేంద్ర ప్రభుత్వ పథకాల వీడియోలను వీక్షిస్తున్న ప్రజలు

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను డిజిటల్ స్క్రీన్‌లో వీడియోల రూపంలో ప్రదర్శించారు. ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్, కళ్యాణ యోజన, దీన దయాళ్, అంత్యోదయ యోజన, పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల్ యోజన తదితర పథకాల వలన ప్రజలకు మేలు కలుగుతుందని వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆందోళన

పలమనేరు: ఏపీ భూహక్కుల చట్టం–2022, చట్టం 27/20023ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పలమనేరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట స్థానిక న్యాయవాదులు ఆందోళన చేశారు. అనంతరం ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. న్యాయవాదుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీపతి, భాస్కర్ మాట్లాడారు. టైటిల్ హక్కును ప్రభుత్వం మంజూరు చేసే క్రమంలో రైతులకు అన్యాయం జరుగుతుందని, ముఖ్యంగా సివిల్ కోర్టుకు అప్పీలు చేసుకునే కక్షిదారుల హక్కును కోల్పోతారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వీటిని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని న్యాయవాదులు బుధవారం కూడా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు ఆధ్వర్యంలో నిరసన దీక్షలు కొనసాగించారు.

ఈరోజు

సీఎం జన్మదిన వేడుకలు

సదుం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించనున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అన్నదానం చేస్తామన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక బస్టాండు కూడలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు తెలిపారు. కేక్ కట్ చేసి, అన్నదానం చేయనున్నట్టు చెప్పారు.

పాడి రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని పిలుపు
- ప్రైవేట్ డెయిరీ నిలువు దోపిడీ, ఏజెంట్లు, దళారుల మోసాలకు ఇక చెక్
- జగనన్న పాలవెల్లువ కేంద్రాల ప్రారంభంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



కల్లుపల్లెలో జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



కలగటూరులో నిర్మించిన జగనన్న పాలవెల్లువ కేంద్రం

గంగవరం: పాడి రైతులకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకోవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి పాలవెల్లువ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మండలంలోని కల్లుపల్లె, కలగటూరులో రూ.36 లక్షలతో నూతనంగా నిర్మించిన జగనన్న పాలవెల్లువ కేంద్రం భవనాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాడిపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో అమూల్ డెయిరీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఇప్పటివరకు పాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి పాడి రైతులను నిలువుదోపిడీకి గురి చేస్తున్న ప్రైవేట్ డెయిరీల దోపిడీకి, దళారీలు, ఏజెంట్ల మోసాలను చెక్ పడటానికి ఇది దోహదం చేసిందని పేర్కొన్నారు. జగనన్న పాలవెల్లువ కేంద్రాల నుంచి పాలను ఎక్కువ ధరకు పాడి రైతుల నుంచి సేకరించడమే కాకుండా వచ్చే లాభాల్లో వారికి సైతం వాటాగా ఇవ్వనున్నట్టు చెప్పారు. అలాగే పాల బిల్లులు ప్రతి పది రోజులకోసా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా జమ చేస్తుందన్నారు. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు, మహిళా సంఘాలు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు జగనన్న పాలవెల్లువ కేంద్రాల ద్వారా వచ్చే లాభాల గురించి అవగాహన కల్పించి, పాడి రైతుల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పార్వతి, వైస్ ఎంపీపీ ఉమాదేవి, ఎంపీటీసీ పార్వతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే

పలమనేరు: పట్టణంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప భక్తుల ప్రత్యేక పూజలకు స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. ఆయనను ఆలయ అర్చకులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మరోసారి పట్టం కట్టరూ!

బైరెడ్డిపల్లె: భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టి, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చేసుకోవాలని ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక షాదీమహల్‌లో వెలుగు సమైఖ్య సీసీ ఉద్యోగి లక్ష్మయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. వెలుగు సంఘ సభ్యులను, మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి విరివిగా రుణాలు ఇచ్చారని, వీటిని ఎంతో మంది మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదిగి, కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో సంఘమిత్రల వినతిపై ఆయన స్పందించారు. ఉన్నతాధికారులతో సంప్రదించి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, వెలుగు సంఘ సభ్యులు పాల్గొన్నారు.



వెలుగు సీసీ లక్ష్మయ్య దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

కోరం లేక మున్సిపల్ సమావేశం వాయిదా

- టీడీపీ కౌన్సిలర్ల నిలదీత
- సమావేశంలోకి దూసుకొచ్చి టీడీపీ కౌన్సిలర్ల భర్తలు ఓవరాక్షన్!
- పోలీసులతో వెలుపలికి గెంటివేత



కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి



సమావేశ మందిరంలోకి దూసుకువచ్చి వాగ్వాదం చేస్తున్న టీడీపీ కౌన్సిలర్ల భర్తలు

పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ సమావేశం కోరం లేక వాయిదా పడింది. మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ముందుగానే కౌన్సిలర్లకు సమాచారం ఇచ్చారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు 10 మంది, టీడీపీ కౌన్సిలర్లు ఇద్దరు హాజరయ్యారు. అయితే సమావేశం నిర్వహణకు కొందరు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు హాజరు కాలేదు. దీంతో కోరం లేక, మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ సమావేశం వాయిదా వేస్తున్నామని, తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలో తెలియజేస్తామని ప్రకటించారు. దీనిపై టీడీపీ మహిళా కౌన్సిలర్లు శారద, సునీత ఆక్షేపించారు. కోరం లేనప్పుడు తమను పిలవడం ఎందుకని కమిషనర్‌ను నిలదీశారు. సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వారికి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇంతలోనే టీడీపీ కౌన్సిలర్ల భర్తలు సమావేశపు హా లులోకి ప్రవేశించి నానా హంగామా చేశారు. అక్కడున్న మీడియాను చూసి మరీ రెచ్చిపోయారు. దీంతో కమిషనర్ కలగజేసుకుని సభ్యులు కాని వారు ఇక్కడికి రావడానికి వీల్లేదని నిక్కచ్చిగా చెప్పడంతో అక్కడున్న పోలీసులు వారికి బయటికి పంపేశారు. ఇలా ఉండగా సమావేశానికి హాజరు కాని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను వివరణ కోరగా.. తాము వ్యక్తిగల పనుల కారణంగా రాలేకపోయామని తెలిపారు.

ఓటర్ల జాబితాలో తప్పిదాలుంటే బీఎల్‌ఓలదే బాధ్యత



తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

రొంపిచెర్ల: ఓటర్ల జాబితాలో పేర్లు, ఇతరత్రా తప్పొప్పులకు పూర్తి బాధ్యత బీఎల్‌ఓలదేనని చిత్తూరు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల క్లెయిమ్స్‌పై సమీక్షించారు. మండలంలో ఫారం6, 7 క్లెయిమ్స్ 2,237 వచ్చాయని, వీటిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 26 నుంచి మండలంలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీఓ రాజేంద్ర, డీటీలు వెంకటరమణా రెడ్డి, లోకేష్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష

కల్లూరు: ఓటర్ల జాబితాపై చిత్తూరు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షించారు. ఓటర్ల క్లెయిమ్స్ ఎన్ని వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. తప్పులు లేని జాబితాను రూపొందించాలని, బీఎల్‌ఓలకు వచ్చిన క్లెయిమ్స్ సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జేసీకి ఎంపీపీ శాలువా కప్పి సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

● భక్తిప్రపత్తులతో పడిపూజ



మండలంలోని తోటకనుమలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద అయ్యప్ప స్వామి పడిపూజ, భజన కార్యక్రమా న్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు.వినాయకస్వామి, సుబ్రమణ్య స్వామి, అయ్యప్పస్వామి ప్రతిరూపాలను అరటి బోదెలు, రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అయ్యప్ప భక్తులు, శివ స్వాములు, భవానీలు, వివిధ ప్రాంతాల దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ యువరాజ్ పాల్గొన్నారు. – వి.కోట

హైవేలో బస్సులపై రాళ్ల దాడులు

- పోలీసులకే సవాల్ విసురుతున్న ఆగంతకులు
- ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినా ఫలితం శూన్యం



దుండగుల రాళ్ల దాడిలో పగిలిన కర్ణాటక ఆర్టీసీ బస్సు అద్దాలు

పలమనేరు: పట్టణ సమీపంలోని గంటావూరు ఫ్లైఓవర్ వద్ద బెంగళూరు– చెన్నై హైవేలో బస్సులపై కొన్నాళ్లుగా సాగుతున్న రాళ్లదాడులు స్థానిక పోలీసులకు సవాలుగా మారాయి. రెండు నెలల నుంచి కేవలం ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై కొందరు వ్యక్తులు రాత్రిపూట ఫ్లైఓవర్ పైనుంచి కిందనున్న సర్వీసు రోడ్డుపై బెంగళూరు నుంచి వచ్చే ట్రావెల్స్ బస్సులపై రాళ్లదాడులకు పాల్పడుతున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో స్థానిక సీఐ చంద్రశేఖర్ సిబ్బందితో వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. కానీ మంగళవారం రాత్రి బెంగళూరు నుంచి పుత్తూరుకు వెళుతున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు అద్దాలపై ఆగంతకులు రాళ్లు విసిరారు. దీంతో బస్సు అద్దం ధ్వంసమైంది. ఈ ఉదంతంపై బస్సు డ్రైవర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా గంటావూరు వద్ద బస్సులపై రాళ్లదాడులు ఆగడం లేదు. పోలీసులు వీళ్ల భరతం ఎప్పుడు పడతారో వేచిచూడాలి.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతులు



ప్రయాణికులకు బహుమతులు ఇస్తున్న డిపో మేనేజర్ సుధాకరయ్య, జయరామిరెడ్డి

పుంగనూరు: ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బుధవారం పుంగనూరు డీఎం సుధాకరయ్య, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి బహుమతులు అందజేశారు. పుంగనూరు డిపో నుంచి రాయచోటి, మేటిమంద, కలికిరి, ముళబాగల్, దొడ్డిపల్లె, తిరుపతి మార్గాల్లో ప్రయాణించే వారి టికెట్లను గిఫ్ట్‌బాక్స్ నుంచి సేకరించి లక్కీడిప్ తీస్తుండటం విదితమే. డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు రూట్లలో ప్రయాణాలను ప్రోత్సహించేందుకు లక్కీడిప్ బహుమతులు ప్రవేశపెట్టినట్టు చెప్పారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు సోమశేఖర్, ఆర్.శంకర్ రెడ్డి, శివ, నిరంజనాచారి, దుర్గమ్మ, రఫీ, వెంకట్రమణ, లక్ష్మీదుర్గ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో గ్యారేజ్ సూపర్‌వైజర్ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

467 మందికి కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న తమ్మిరెడ్డి

పెద్దపంజాణి: మండలంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో వైద్యాధికారులు 467 మందిలో కంటి సమస్యలను గుర్తించి, వారికి కళ్లద్దాలు అవసరమని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో వారందరికీ కళ్ల అద్దాలు మంజూరైనట్లు పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా రాజుపల్లె సచివాలయం పరిధిలో 23 మందికి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న భక్తులకు అన్నదానం



అన్నదానం, మాత్రల పంపిణీ చేస్తున్న సురేంద్రయ్య

రొంపిచెర్ల: ఇతర రాష్ట్రాల నుంచి కాలి నడకన తిరుమలకు వెళుతున్న వందలాది మంది వెంకన్న భక్తులకు పెద్దగొట్టిగల్లు శివాలయం వద్ద పీలేరుకు చెందిన కృష్ణ మెడికల్స్ అధినేత సురేంద్రయ్య బుధవారం అన్నదానం చేశారు. అలాగే ఉచితంగా మాత్రలను పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఆయన ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ.

టమాట రైతుపై మండీ యజమాని దాడి

పలమనేరు: తాను వేసిన టమాటాలకు సంబంధించి బిల్లుల డబ్బును చెల్లించాలని కోరిన రైతుపై మండీ నిర్వాహకుడు, అతని సిబ్బంది దాడి చేసి గాయపరచిన సంఘటన పలమనేరులో చోటుచేసుకుంది. బాధితుని ఫిర్యాదు మేరకు..మండలంలోని జరావారిపల్లెకు చెందిన మునిరత్నం రెడ్డి మూడునెలలుగా స్థానిక ఎస్‌బీజీ మండీకి టమాటాలు వేస్తూ మూడు, నాలుగు బిల్లులకు ఒకేసారి డబ్బులు తీసుకునేవాడు. ఈ నేపథ్యంలో తన బిల్లుల విషయంలో మండీ రైటర్ మోసం చేశాడని తెలుసుకుని దీనిపై ఇటీవల ప్రశ్నించాడు. ఆగ్రహించిన మండీ యజమాని బాలాజి తన అనుచరులు రవి, జీవా తదితరులతో కలిసి దాడికి పాల్పడ్డారు. దీంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితుడు ఆపై మదనపల్లెలో ట్రీట్‌మెంట్ పొందాడు. బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయల దుకాణం ఏర్పాటు



శెట్టిపల్లెలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ దుకాణం

గుడుపల్లె: మండలంలోని శెట్టిపల్లెలో మహిళా సంఘాల సభ్యులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయల విక్రయానికి దుకాణం ప్రారంభించారు. బుధవారం ఎన్‌పీఎం యూనిట్ ఇన్‌చార్జ్‌లు మునిక్రిష్ణ , శ్రీదేవి దీనిని ఏర్పాటు చేశారు. శెట్టిపల్లెకు చెందిన లక్ష్మి గ్రామ సమీపంలోని గోకర్లపల్లెలో ఎన్‌పీఎం (నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్) ద్వారా సేంద్రియ ఎరువులతో కూరగాయలు సాగు చేశారు. వీటి అమ్మకాలకు దుకాణాన్ని ప్రారంభించి యూనిట్ ఇన్‌చార్జ్‌లు మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ప్రకృతి వ్యవయోత్పత్తులను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రీటా, వేల్‌మురుగన్, లక్ష్మయ్య, కవిత, రంగప్ప, వినోద్, వీఓ లీడర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధి నిర్మూలనకు కృషి



ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం

రొంపిచెర్ల: బోదకాలు వ్యాధి నిర్మూలనకు అందరూ తమవంతు కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో 23, 26 తేదీలలో ఫైలేరియా నిర్ధారణ కోసం మండలంలో రక్త నమూనాలను సేకరిస్తామన్నారు. అలాగే 26న పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీలో రాత్రి 8 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.